


గరుడ వాహన సేవలో టిటిడి ఛైర్మన్

శ్రీసిటీలో 'పోష్' చట్టంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- వరదయ్యపాలెం

పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నివారణ చట్టం అవగాహన సదస్సు శుక్రవారం శ్రీసిటీలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని శ్రీసిటీ, మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ , కొన్రాడ్-అడెనౌర్-స్టిఫ్టుంగ్ సంస్థ సంయుక్తంగా నిర్వహించాయి, ఇందులో గుర్తింపు పొందిన పోష్ శిక్షకురాలు తిలగా పొర్చెల్వన్ స్పీకర్‌గా పాల్గొన్నారు.

శ్రీసిటీ హెచ్‌ఆర్ ఏజీఎం వి.శివకుమార్ సదస్సులో పాల్గొన్న వారికి సాదర స్వాగతం పలికి, వక్తలను పరిచయం చేశారు. చెన్నైకు చెందిన ఎంఎంఎ ప్రతినిధి ఆర్.సతీష్ కుమార్ ఈ సదస్సు యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, కార్యక్రమానికి వచ్చిన వారంతా పోష్ గురించి సమగ్రంగా తెలుసుకునేందుకు చురుకుగా పాల్గొనవలసిందిగా కోరారు.

తిలగా కార్యక్రమ ముఖ్యాంశాలను చెబుతూ, 2013 పోష్ చట్టం ఆధారంగా విశాఖ వర్సెస్ రాజస్థాన్ ల్యాండ్‌మార్క్ తీర్పు ఫలితం ఎలా వచ్చిందో ఉదాహరణతో 'లైంగిక వేధింపు' అర్థాన్ని వివరించింది. వ్యక్తులు, సంస్థలపై లైంగిక వేధింపుల హానికర ప్రభావాన్ని వివరిస్తూ, సురక్షితమైన వాతావరణం యొక్క అవసరాన్ని ప్రస్తావించారు. పోష్ లో భాగమైన అంతర్గత ఫిర్యాదుల కమిటీల పాత్ర, ఫిర్యాదు దాఖలు విధానాలపై ఆమె చర్చించారు. కంపెనీలలో లైంగిక వేధింపులకు సంబంధించిన యదార్థ ఉదాహరణలను చెబుతూ, దానిని నిరోధించడంలో యాజమాన్యాల బాధ్యతలను గుర్తు చేశారు. అవగాహన పెంచుకోవడం, విధానాలను అమలు చేయడం, పటిష్టమైన ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేయడంపై ఆమె సలహాలు, సూచనలు ఇచ్చారు. లైంగిక వేధింపులు ఎదురైనప్పుడు లేదా చూసినప్పుడు వారి హక్కులను కాపాడుకోవడంతో పాటు, తగిన రీతిలో ఎలా ప్రతిస్పందించాలో వివరించారు. ఇంకా పోష్ చట్టంలోని కార్మికుల బాధ్యతలు, అర్హతలను ఈ సదస్సులో తెలియచేశారు.

శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్పందిస్తూ, మహిళా వేధింపుల పట్ల అవగాహన, వేధింపుల నుంచి ఎలా బయటపడాలో తెలుసుకోవడంతో పాటు సురక్షితమైన సమ్మిళిత పని వాతావరణాన్ని సష్టించడంలో ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.

వేడుకగా గరుడసేవ

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు ఉదయం మోహినీ అలంకారంలోనూ, రాత్రి గరుడవాహనంపైనా మలయప్పస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. గరుడసేవకు లక్షల్లో భక్తులు వస్తారని అనుకున్నా ఆశించిన స్థాయిలో రాలేదన్న చర్చ నడిచింది. ఎక్కువగా తమిళ భక్తులు, తిరుపతి స్థానికులతోనే గరుడసేవ సందడి కనిపించింది. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు యానాదయ్య, ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్‌ఒ నరసింహ కిషోర్ పాల్గొన్నారు.

వాహనబేరర్లకు పంచెలు పంపిణీ

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న వాహనబేరర్లు, మేళం సిబ్బందికి శుక్రవారం తమిళనాడుకు చెందిన దాత తంగదొరై రెండు లక్షల విలువైన 120 పంచెలను బహుమానంగా అందించారు. ఉదయం పల్లకీ ఉత్సవం అనంతరం వైభవోత్సవ మండపంలో టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి చేతుల మీదుగా దాత ఈ పంచెలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ శ్రీహరి, పారుపత్తేదార్ తులసీప్రసాద్ పాల్గొన్నారు.

భక్తుల సదుపాయాలు పరిశీలన

గరుడసేవను చూడటానికి తిరుమల నాలుగు మాడ వీధుల్లో వేచి ఉన్న భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలను ఈవో ఎవి ధర్మారెడ్డితో కలిసి టిటిడి ఛైర్మన్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. భక్తులకు చేసిన ఏర్పాట్లు, ఆహారం పాలు, కాఫీ, టీ, తాగునీరు అందుతున్నాయా అని గ్యాలరీల్లోని భక్తులతో మాట్లాడారు. గ్యాలరీలో వేచి ఉండే ప్రతి భక్తునికీ గరుడ వాహనంపై ఉన్న మలయప్పస్వామివారి దర్శనం చేయించిన తరువాతే స్వామివారు ఆలయానికి వేంచేస్తారని తెలిపారు. దాదాపు 1500 మంది శ్రీవారి సేవకులు భక్తులకు సేవలు అందిస్తున్నారు.

భక్తుల కోసం అన్నప్రసాదాలు

భక్తుల కోసం ఉదయం 5 నుండి 6 గంటల మధ్య పాలు, కాఫీ, ఉదయం 6.30 నుండి 8 గంటల మధ్య ఉప్మా, పొంగలి పంపిణీ చేశారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉదయం 10 గంటలకు సాంబార్ అన్నం, టమాటా అన్నం, స్వీట్ పొంగల్ అందించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి దాదాపు 3 గంటల వరకు భక్తులకు రెండు లక్షలకు పైగా పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. సాయంత్రం సుండల్, కాఫీ, పాలు పంపిణీ చేశారు. సాయంత్రం 7 గంటలకు గరుడవాహనం ప్రారంభం కానుండగా ఉత్తర, తూర్పు మాడ వీధుల్లో సాయంత్రం 6 గంటల వరకు వెజిటబుల్ కిచిడీ పంపిణీ చేశారు.

అధికారులకు అభినందనలు

టీటీడీ జెఈవో వీరబ్రహ్మం ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎఫ్ఏసీఏవో బాలాజి, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్‌కుమార్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాలుగు మాడ వీధుల్లో భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించేందుకు విధులు అప్పగించిన సీనియర్ అధికారులను టీటీడీ ఛైర్మన్, ఈవో అభినందించారు.

కళారూపాలు

మోహినీ అవతారంలో..

కళారూపాలు

29న విజయవాడలో మహాధర్నా : కెవిపిఎస్

పోస్టర్ ఆవిష్కరణలో...

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా వినియోగించాలని, దళితులకు రక్షణ కల్పించాలని కోరుతూ సెప్టెంబర్29వ తేదీన విజయవాడలో చేపట్టే సామాజిక న్యాయంకై చేపట్టే మహాధర్నా పోస్టర్ ను శుక్రవారం యశోద నగర్ లోని ఎంబి భవన్ లో కెవిపిఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు పి. ముని రామయ్య మాట్లాడుతూ అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం దళితుల రక్షణ కోసం ఉన్న చట్టాలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారని అన్నారు. ఎస్టీ ,ఎస్టీ కార్పొరేషన్లను ఉత్తుత్తి కార్పొరేషన్లగా మార్చి ఉపాధి లేకుండా చేశారని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్లు లోపు ఇచ్చే ఉచిత విద్యుత్తు పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. సామాజిక న్యాయం కోసం ఈనెల 29వ తేదీ విజయవాడలో జరుగుతున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వందవాసి నాగరాజు, కెవిపిఎస్ నాయకులు ఎండి శ్రీనివాసులు, చైతన్య, సిఐటియు నాయకులు టి సుబ్రమణ్యం, కే వేణుగోపాల్, పి బుజ్జి, వి ఎస్ మన్యం, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, తిరుపతి స్థానిక హక్కుల పోరాట కమిటీ నాయకులు డీఎంసీ భాస్కర్, మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొడితే రావణకాష్టమే...: టిడిపి

శ్రీకాళహస్తిలో నిరసన దీక్ష

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం రావణ కాష్టంలా మారిందని టీడీపీ మహిళా విభాగం నాయకులు విమర్శించారు. స్థానిక ఎన్టీఆర్ భవన్ వద్ద చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ శుక్రవారం తెలుగు మహిళలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. రావణుడులాంటి జగన్, రాముడు లాంటి చంద్రబాబును జైల్లో పెట్టడం బాధాకరమన్నారు. ఆయన్ని బేషరుతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చక్రాల ఉష, కష్ణవేణి, సుమతి, సుభాషిణి, విజయ్ కుమార్, దసరథ ఆచారి, గురువారెడ్డి, ఎస్సీవీ దిలీప్, చెంచయ్య నాయుడు, గాలి మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు. తొట్టంబేడు మండలాధ్యక్షులు గాలి మురళీనాయుడు ఆధ్వర్యంలో చిన్న సింగమల వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

గూడూరులో.. టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు అసనాపురం వెంకటేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆధారాలు లేకుండా నారా చంద్రబాబును అరెస్టు చేయడం అక్రమమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం తథ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్, దావూద్, శంకర్, ధనుష్ పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో చేస్తున్న రిలే దీక్ష 10వ రోజు కుటుంబసభ్యులతో కలిసి జరిగింది. మాజీ శాసనసభ్యులు పాశిం సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

గంగవరంలో... ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పాదయాత్రగా కీలపట్లలోని కోనేటిరాయస్వామి ఆలయం వరకూ వెళ్లారు. వెంకటేశ్వరస్వామి చిత్రపటానికి పూజలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి వెంటనే విడుదల కావాలని టెంకాయలు కొట్టి స్వామివారిని వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో సోమశేఖర్‌గౌడ్, ఆర్వీసీ కుట్టి, నాగరాజు పాల్గొన్నారు. **గుడిపల్లిలో...** మాజీ జడ్‌పిటిసి బెటప్పనాయుడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అగరం సర్పంచి గోపాల్, మంజునాథ్, గోవిందస్వామి పాల్గొన్నారు.

కార్యకర్త గుండెపోటుతో మృతి

పుంగనూరు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు స్కిల్ స్కామ్ కేసులో బెయిల్ రాలేదనే తీవ్ర మనోవేదనకు గురై గురువారం గుండెపోటుతో మతి చెందాడు. మండలంలోని చంద్రమాకులపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఒంటిమిట్ట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త శ్రీనివాసులు నాయుడు చంద్రబాబును అక్రమ కేసులతో జైల్లో పెట్టి హింసకు గురి చేస్తున్నారని మనోవేదన గురి కావడంతో గుండెపోటు వచ్చి మతి చెందాడు. కార్యకర్త మరణం గురించి తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి సతీమణి చల్లా సుప్రియ రెడ్డి, సోదరి వీణారెడ్డి మతుని ఇంటికి వెళ్లి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కుటుంబానికి ధైర్యం చెబుతూ..

కొనసాగుతున్న డెయిరీ కార్మికుల దీక్షలు

చిత్తూరుఅర్బన్: సహకార విజయడెయిరీలో పని చేసి విఆర్ఎస్ తీసుకొన్న కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ స్థానిక రెడ్డిగుంట వద్ద ఉన్న అమూల్ డెయిరీ ఎదుట కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారానికి పదో రోజుకు చేరుకుంది. తమకు చట్టపరంగా అందాల్సిన జీతాలు చెల్లించేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షా శిబిరాన్ని గురువారం పోలీసులు, రెవిన్యూ అధికారులు బలవంతంగా తొలగించారు. దీక్షా శిబిరాన్ని తొలగించినా కార్మికులు రిలే దీక్షను కొనసాగిస్తున్నారు. పోలీసులు, రెవిన్యూ అధికారులు, కో ఆపరేటివ్ సహకార సంస్థ అధికారులు కార్మికులను బెదిరింపుకలు గురి చేస్తూ దీక్షా శిబిరాన్ని బలవంతంగా తొలగించడం పట్ల కార్మిక సంఘం నాయకులు కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన జీతాలపై స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విజయ సహకార డెయిరీ కార్మికుల యూనియన్ నాయకులు కుమార్ శుక్రవారం అస్వస్థతకు గురికావడంతో చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పదో రోజు కొనసాగుతున్న డెయిరీ కార్మికుల దీక్ష

ఎరువులు ఎక్కువగా వాడొద్దు : ఎడిఎ

ప్రజాశక్తి - వెంకటగిరి

'ఎరువులు ఎక్కువగా వేస్తే ఆదాయం ఎక్కువ వస్తుందనేది పూర్తిగా అపోహ, ఖర్చు ఎక్కువై అన్నదాతకు ఆదాయం తగ్గుతుంది' అని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఎడిఎ మెరుగు భాస్కరయ్య తెలిపారు. ఆత్మ సహకారంతో వెంకటగిరి మండలం పారవోలు గ్రామంలో వరి సాగుపై ఆయన రైతులకు శిక్షణ ఇచ్చారు. వరికి యూరియా ఎక్కువగా వేస్తే చీడ బెడద ఎక్కువవుతుందన్నారు. భూమిలో భాస్వరం నిల్వలుపెరిగితే జింక్ పోషకం పైరుకు అందదని తెలిపారు. దీనివలన రైతుకు ఖర్చు పెరగడం తప్ప లాభం ఏమీ ఉండదని చెప్పారు. వరికి దుక్కిలో, చిరు పొట్ట దశలో 20 కిలోల చొప్పున పొటాష్ వేస్తే చీడల సమస్య తగ్గి, ధాన్యం నాణ్యంగా ఉంటుందని చెప్పారు. ఎఒ వేణుగోపాలరావు రబీ కాలంలో సాగుకు అనువైన వరి రకాలు, నారు పెంపకంలో మెళకువలు, కలుపు నిఆరణ గురించి వివరించారు. రబీలో పంటల సాగుకు అవసరమైన ఎరువులను ఆర్‌బికెల్లో అందుబాటులో ఉంచుతామని, వీటిని రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుజాత కోరారు. గ్రామ వ్యవసాయ సహాయకులు శివ పాల్గొన్నారు.

అన్నదాతలకు అవగాహన కల్పిస్తూ...

విద్యార్థులతో పనులు చేయించొద్దు : డిఇఒ

ప్రజాశక్తి - బాలాయపల్లి

విద్యార్థులకు చదువు చెప్పాలే కానీ, వారితో పనులు చేయించడం తగదని జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ అన్నారు. మండలంలోని వెంగమాంబపురం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు లేకపోతే ఆయా, మధ్యాహ్న భోజన నిర్వాహకులతో తెప్పించుకోవాలే తప్ప, విద్యార్థులతో ఎలా తెప్పిస్తారని మండిపడ్డారు. ఏమన్నా జరిగితే మీరు బాధ్యులవుతారా అని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయునిపై మండిపడ్డారు. పదో తరగతి సిలబస్ ఎంతవరకు అయ్యిందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ కల్లా సిలబస్ పూర్తి చేసి, అప్పటినుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించి, అదనపు తరగతులు తీసుకుని, వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు తయారు చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

డిఇఒ ఆకస్మిక తనిఖీ

క్యాన్సర్ నివారణలో ఇమ్యునోథెరపీ కీలకం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రానున్న రోజుల్లో క్యాన్సర్ నివారణలో అమ్యునో థెరపీ కీలకపాత్ర పోషించనుందని డాక్టర్‌విజయ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. స్విమ్స్ పాథాలజీ విభాగం ఆధ్వర్యంలో పద్మావతి ఆడిటోరియంలో అతిథి ఉపన్యాసం విజయవంతంగా సాగింది. ఈ దిశగా ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు విస్తృతస్థాయిలో జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం కీమోథెరపీ, రేడియోథెరపీ, సర్జరీ ఈ మూడు ప్రక్రియలు క్యాన్సర్ చికిత్సకు అందుబాటులో ఉన్నాయన్నారు. తాజాగా ఇమ్యునోథెరపీ అందుబాటులోకి రానుందన్నారు. క్యాన్సర్ సోకిన భాగంలో ఇంజనీర్డ్ ఇమ్యూన్ సెల్స్ పాత్రపై వర్కుషాపు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో స్విమ్స్ ఉపకులపతి డాక్టర్ ఆర్‌వి కుమార్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఉషా కళావత్, పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ రుక్మాంగద పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

సర్టిఫికెట్లతో విద్యార్థులు

రేణిగుంట : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం గురుజాడ జయంతి సందర్భంగా బాలికల పాఠశాలలో సభ నిర్వహించి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు ఈ పోటీల్లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి కన్వీనర్ ఓ. వెంకటరమణ మాట్లాడుతూ గురుజాడ రచనలు ప్రగతి బాట కాలాతీతుడని, దేశభక్తి గీతం ఉన్నతమైన భావాలతో కూడినదని, దేశమంటే మనుషులని, మత బేదాలు విడిచి పెట్టి అన్నదమ్ముల్లా కలసి వుండాలని, ఆధునిక కవిత్వం ద్వారా వాడుక భాషలో అందించారన్నారు. సంఘ సంస్కరణ, స్త్రీ చైతన్య లాంటి అనేక రచనలు చేసిన దార్శనికుడు అన్నారు. నేడు ఐక్యత, సహనం, అభ్యదయాన్ని గురుజాడ దగ్గర నుంచి నేర్చుకోవలసింది అని ఆయన చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధనం ఉపాధ్యాయులు పాల్గొన్నారు! అనంతరం విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు.

శేష వాహనంపై విఘ్నేశ్వరుడి విహారం

ప్రజాశక్తి -కాణిపాకం (ఐరాల)

ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాకం శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు శుక్రవారం స్వామివారు శేష వాహనంపై విహరించి కాణిపాకం పురవీధులలో ఊరేగుతూ భక్తులను అలరించారు . స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శేష వాహనం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవ ఉభయదారులైన. కాణిపాకం ,కాకర్లవారి పల్లె. వడ్రంపల్లె. ,మిట్ట ఇండ్లు. కొత్తపల్లె. అడప గుండ్ల పల్లె. బోమ్మ సముద్రం. తిరువనం పల్లె. చిగరపల్లె. అగరంపల్లె. వంటి గ్రామాలకు చెందిన కమ్మ వంశస్థులు. ఉభయదారులుగా వ్యవహరించారు ఈ మేరకు వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చక స్వాములు వేద పండితులు మంత్రోచ్చారణ నడుమ స్వామివారి మూలవిరాట్ కు వివిధ రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే స్వామి వారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మరో మారు ధూప దీప నైవేద్యాలు సమర్పించి. అనంతరం వివిధ రకాల సుగంధ పరిమళ పుష్పాలు తో అలంకరించిన శేష వాహనంపై స్వామి అమ్మవార్లను ఉంచి కాణిపాకం పురవీధులలో ఘనంగా ఊరేగించారు ఈ సందర్భంగా భక్తులు నారికేల కర్పూర హారతులతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి. ఆలయ ఈవో వెంకటేశు. ఈ ఈ వెంకటనారాయణ. ఏఈ ఓలు విద్యాసాగర్ రెడ్డి. ఎస్ వి కష్ణారెడ్డి. రవీంద్రబాబు. హేమమాలిని. హరి మాధవరెడ్డి. సూపర్డెంట్లు శ్రీధర్ బాబు. కోదండపాణి. టెంపుల్ ఇన్స్పెక్టర్లు బాబు. సురేష్. స్థానిక సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి పాల్గొన్నారు.



కాణిపాకంలో భక్తులకు దర్శనమిస్తూ....

పోలింగ్ కేంద్రాలు హేతుబద్ధీకరణ : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఎన్నికల కమిషన్ నిబంధల మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపట్టామని, జిల్లాలో కొత్తగా 26 పోలింగ్ కేంద్రాలకు, 2 విలీనానికి ప్రతిపాదనలు సిద్ధంచేసామని కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి వివరించారు. శుక్రవారం కలెక్టరేట్ లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణలో భాగంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్దేకరణ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై వివరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబందనల మేరకు ఓటరకు పోలింగ్ కేంద్రాల దూరం 2 కిమీ మించరాదని, పోలింగ్ కేంద్రంలో 1400 ఓటర్లకు మించరాదని ఆదేశాలతో జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్దేకరణ చేపట్టామన్నారు. ఏదైనా సూచనలు వుంటే రాతపూర్వకంగా అందిస్తే వెంటనే పరిశీలిస్తామన్నారు. కమిషనర్ హరిత, డి ఆర్ ఓ పెంచల కిషోర్ పాల్గొన్నారు.

నేతాజీరోడ్డులో అన్నదానం

తిరుపతి టౌన్ : వినాయకస్వామి ఉత్సవాల్లో భాగంగా నేతాజీరోడ్డులో అన్నదానం చేశారు. మేయర్ డాక్టర్ శిరీష పూజలు నిర్వహించారు. అనంతరం స్థానికులు మేయర్‌ను సన్మానించారు. నాయకులు సుబ్రమణ్యం యాదవ్, గుండాల గోపీనాథ్, అక్కిపల్లి మునికృష్ణయాదవ్ పాల్గొన్నారు.

అందుబాటులో అన్ని స్టాంపులు

- తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ విజయ్ కుమార్

ప్రజాశక్తి-తొట్టంబేడు: తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అన్ని రకాల స్టాంపులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని సబ్ రిజిస్ట్రార్ విజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపులు అందుబాటులో లేవనీ, ప్రజలు పడిగాపులుగాస్తున్నట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దే ఈ-స్టాంపుల విక్రయ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒకటి కొన్నా, పది స్టాంపులు కొన్నా గానీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.50 యూజర్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. యూజర్ చార్జీల భారం ఎత్తివేయాలని కోర్టులో ప్రజా వ్యాజ్యం దాఖలైందని, తీర్పు వచ్చే వరకు ప్రజలు సహకరించాలని కోరారు.

సచివాలయ భవన నిర్మాణ సిమెంట్ మాయం చేశారు..

ప్రజాశక్తి - బాలాయపల్లి: రాష్ట్ర ప్రభుత్వం సచివాలయం నిర్మాణం కోసం పంపిణీ చేసిన సిమెంటును మండలంలోని మన్నూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ బట్టేపాటి మురళీమోహన్ రెడ్డి మాయం చేశారని మండల తహశీల్దారు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'జగనన్నకి చెప్పుకుందాం'లో గ్రామస్తులు తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్ డి.కె బాలాజీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సచివాల యం నిర్మాణం కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన సిమెంటును మాయం చేయడం వల్ల పిల్లర్లకు ఏర్పాటు చేసిన కమ్మి తుప్పు పట్టి పోయిందన్నారు. స్పందించిన జెసి పంచాయతీరాజ్ శాఖ ఎస్ ఈ కి చరవాణి ద్వారా వెంటనే విచారణ చేపట్టాలని ఆదేశించారు. అంతేకాకుండా బాలాయపల్లి మండలంలో పదివేల సిమెంటు బస్తాలు అన్యాక్రాంతమయ్యాయన్నారు. మన్నూరు కొత్తూరు గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగావుందని జెసి దృష్టికి తీసుకొచ్చారు. చేతి బోరు పైపులు గ్రామ సర్పంచి ఎవరికీ తెలియకుండా మాయం చేశారని తెలిపారు. తాగేందుకు మినరల్ వాటర్ కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. పశువులకు నీళ్లు లేక అల్లాడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తాగునీటి పరిష్కరించకపోతే పోరాడుతామన్నారు. గొట్టికాడ గ్రామంలో అంగనవాడి భవనం నిర్మించాలని ఆ గ్రామ సర్పంచి వెందోటి సుప్రజ జెసికి విన్నవించారు.

తక్షణమే పరిష్కారం: జెసి

మండలంలోని 24 పంచాయతీలకు సంబంధించి వివిధ సమస్యలపై 117 అర్జీలు వచ్చాయి. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు వారం రోజుల్లో వాటికి పరిష్కార మార్గం చేపడుతారని జెసి బాలాజీ పేర్కొన్నారు. మండలంలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని, భూ సమస్యలు ఉన్నవారు కోర్టుకు వెళ్లి పరిష్కరించుకోవాలని ఆదేశించారు. అంతే కాకుండా భూ సమస్యలపై వెంటనే పోలీసులు కేసులు నమోదు చేసి ఇరు వర్గాలను పిలిపించి పూర్తి హక్కు వున్న వారికే ఆ భూమి హక్కు కల్పించేందుకు రెవెన్యూ శాఖకు సహకరించాలని పోలీసులను ఆదేశించారు. అర్హత ఉన్నవారికి పింఛను వెంటనే వచ్చేలా ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని జిల్లా డిఆర్డిఏ పీడీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భాస్కర్ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి, రాయి దేవిక చౌదరి, గొట్టికాడు గ్రామ సర్పంచి వెందోటి సుప్రజా, తులసి రెడ్డి, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి జెసికి ఫిర్యాదు

సిమెంటు బస్తాలు మాయంపై జెసి బాలాజికి ఫిర్యాదు చేస్తున్న మన్నూరు గ్రామస్తులు

ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడల పోటీలు

ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో కొనసాగిన క్రీడలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు, ఎంపికలు గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రెండో రోజు కొనసాగాయి. కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పిఈటి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి క్రీడాకారులు వచ్చారని కబడ్డీ , బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించామని తెలిపారు. శనివారం మరికొన్ని క్రీడలు నిర్వహిస్తామన్నారు. ఈ క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని అక్కడ నుంచి రాష్ట్రస్థాయి పోటీలకి వెళతారని పేర్కొన్నారు.

పౌష్టిక ఆహారంతో శిశు మరణాలకు చెక్: పీడీ

ప్రజాశక్తి - బాలాయపల్లి: అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టి కాహారంతో శిశు మరణాలకు అడ్డు కట్ట వేయవచ్చని జిల్లా స్త్రీ సంక్షేమ శాఖ పీడీ జయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగ న్వాడీ కార్యాలయంలో గొట్టి కాడు , రామాపురం, యాచవరం, అంబలపూడి, సుబ్రమణ్యం గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యాలయాలు పరిధి లో గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. తఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యాలయం ద్వారా ప్రభుత్వ అందిస్తున్న పౌష్టి కాహారాన్ని ప్రతి బాలింతకు , గర్భవతులకు అందేలా ప్రత్యేకమైన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం పౌష్టికాహార పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ సూపరువైజర్లు రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి -బాలాయపల్లి : మండలంలోని నిడిగల్లు సచివాలయం పరిధిలోని సిద్ధగుంట గ్రామం, అలిమిలి గ్రామ సచివాలయం పరిధిలోని పాత వెంకట రెడ్డి పల్లి, అంబలిపూడి మెయిన్ గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నామని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పాల్గొంటారని వైసిపి మండల అధ్యక్షులు వెందోటి కార్తీక్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

కేకును కట్ చేస్తున్న డాక్టర్ రమాదేవి

ఘనంగా డాక్టర్ రమాదేవి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- రేణిగుంట : అమర హాస్పిటల్ అధినేత డాక్టర్ గౌరినేని రమాదేవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గౌరినేని రమాదేవి 59వ పుట్టినరోజు వేడుకలను అమర హాస్పిటల్‌లో డాక్టర్లు సిబ్బంది సమక్షంలో కేక్ ని కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకట శివకృష్ణ, డాక్టర్ వరుణ్, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ శివపార్వతి, సీఎఓ వేణుగోపాల్,దివ్య, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బీకేఎంయూ జిల్లా కార్యదర్శిగా ప్రభాకర్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తిరుపతి జిల్లా బీకేఎంయూ ప్రధాన కార్యదర్శిగా సీహెచ్. ప్రభాకర్ ఎంపికయ్యారు. బీకేఎంయూ జిల్లా నిర్మాణ మహాసభలు శ్రీ కాళహస్తి పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీకి ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ ప్రభాకర్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీహెచ్. ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో రైతు సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తామన్నారు. సీపీఐ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి జీ. శశికుమార్, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కే. నారాయణ, ఎంబేటి చంద్రయ్య బీకేఎంయూ జిల్లా కార్యదర్శిగా ఎంపికైన సీహెచ్. ప్రభాకర్ కు శుభాకాంక్షలు తెలిపారు.

జాతర పనులు ప్రారంభం...

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో పోలేరమ్మ జాతరకు పట్టణంలో అన్ని ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడానికి ఒక ప్రణాళిక బద్దంగా సిబ్బందికి ఆయా పనులను అప్పగించిశుక్రవారం కమిషనర్ వెంకటరామయ్య ప్రారంభించారు. ఇంజనీరింగ్ సెక్షన్ సిబ్బందికి సెంటర్ లైటింగ్ డివైడర్ లో ఉన్న చెట్లను అందంగా కట్ చేయించడం, కైవల్య నదీ ప్రాంతంలో పిచ్చి మొక్కలు తొలగిస్తూ నీరు నిలవకుండా ఒకవైపు కాలవను తీయడానికి ఏర్పాటు చేశారు. 25 వార్డులలో ముళ్లపొదులను తొలగించడానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం మొదటిసారిగా ప్రభుత్వ పండగ ప్రకటించిన పోలేరమ్మ జాతరను ఎంతో వైభవంగా అసౌకర్యాలు భక్తులకు కలగకుండా పగడ్బందీగాన్ని అన్ని సదుపాయాలు చేస్తున్నట్లు తెలిపారు. కైవల్య నది ఒడ్డున ఏర్పాటు చేస్తున్నా రంగులరాట్నం, జైంట్ వీల్ కొత్తగా తోలిన మట్టిపై అమర్చడం వల్ల ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని దాన్ని అక్కడనుండి తొలగించడానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ అన్నారు. పోలేరమ్మ జాతర కు సుదీర్ఘ ప్రాంతాల నుండి లక్షలాది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తున్న సందర్భంగా రెడీమేడ్ టాయిలెట్స్, అన్ని సౌకర్యాలు ఏర్పాటు తెలిపారుజ

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : మన రాష్ట్రంలోని ప్రజలందరి ఆరోగ్య పరిరక్షణకై మన ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చెసింది. పేదలందరికీ ఆరోగ్య భరోసా కల్పించాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంట్లో ఆరోగ్య సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే భాధ్యతను కూడా మన ప్రభుత్వం తీసుకుంటుంది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామం లో ఒక రోజు హెల్త్ క్యాంపు నిర్వహిస్తారు. అందులో ప్రజలకు అవసరమైన పరీక్షలు చేయడంలో పాటు మందులు, కళ్ళద్దాలు కూడా బాధితులకు అందిస్తారు. హెల్త్ క్యాంపు నిర్వహించిన గ్రామాన్ని మ్యాపింగ్ చేసి ఏ సమస్యలున్నాయన్నది తెలుసుకుని ఫ్యామిలీ డాక్టర్ విలేజ్ క్లినిక్ ద్వారా వాటిని పరిష్కరిస్తారు. ఇంట్లో పక్షవాతం, మరేదైనా దీర్ఘకాలిక సమస్యలుంటే వారికి క్రమం తప్పకుండా మందులు అందించటంతో పాటు వైద్యులు వారిని పరీక్షించి చికిత్స అందిస్తారు.

25న చలో విజయవాడను జయప్రదం చేయండి: సిఐటియు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 25 తేదీన చేపట్టనున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో పుత్తూరు సిడిపిఓ పద్మజకి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు తెలంగాణ కన్నా అదనంగా కనీస వేతనం పెంచుతామని ఎన్నికల సందర్భంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆయన అధికారానికి వచ్చి నాలుగున్నర ఏళ్ల గడుస్తున్నా ఇంత వరకు జీతాలు పెంచలేదని , వారి డిమాండ్లు పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ రకాల యాప్స్ ఇచ్చి ఇబ్బందులు పెడుతున్నారని మానసిక ఒత్తిళ్లకు గురి చేస్తున్నారన్నారు. తక్షణమే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాడ్యూటీ రాష్ట్రంలో అమలు చేయాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని, ఎఫ్ఆర్ఎస్, వివిధ రకాల యాప్ లను రద్దుచేసి ఒక యాప్ ద్వారా విధులు నిర్వహించే విధంగా చేయాలని, ప్రభుత్వ ఉద్యోగాలు గుర్తించాలని, వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈనెల 25 తేదీన చలో విజయవాడ ను అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు విజయ కుమారి, ముని కుమారి, అన్నపూర్ణ, రాధా, ధనమ్మ, అంబికా పాల్గొన్నారు.

ఎస్వీయూతో సుజన్ లైఫ్ సైన్సెస్ సహకార ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంతో సుజన్ లైఫ్ సైన్స్ సంస్థ శుక్రవారం పరస్పర అంగీకార ఒప్పందం చేసుకుంది. ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి, సుజన్ లైఫ్ సైన్స్ వ్యవస్థాపకుడు డా. దామోదరరెడ్డి లు పరస్పర అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు. ఎంఓ యు ప్రకారం రెండు సంస్థలు లైఫ్ సైన్స్ రంగంలో సేఫ్టీ డ్రగ్ టెస్టింగ్, డ్రగ్ డిస్కవరీ రీసెర్చ్ , ఫార్మాసూటికల్స్, బయోటెక్నాలజీ, యనిమల్ మోడల్ డిసీజస్, స్టూడెంట్ రీసెర్చ్ వంటి అంశాలపై రెండు సంస్థలు పరస్పరం సహకారం అందించుకుంటాయని విసి అన్నారు. ఎస్వీయూ పూర్వ విద్యార్థి అయిన సుజన్ లైఫ్ సైన్స్ సంస్థ యజమాని యస్ ఆర్ ఐ గా 35 సంవత్సరాల ఫార్మారంగ అనుభవాన్ని కలిగివున్నారని , 2006 లో తిరుపతిలో స్థాపించిన సంస్థతో ఒప్పందం లైఫ్ సైన్స్ లో మరిన్ని పరిశోధనా సౌకర్యాలను అందిస్తుందని ఉపకులపతి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ , డీన్లు ఆచార్య అప్పారావు, ఆచార్య తులసీ రామకృష్ణారెడ్డి, ఆచార్య ఎస్. విజయభాస్కరరావు , ఆచార్య కిషోర్ పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రీ ఆర్‌డి సెలక్షన్స్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, తిరుపతిలోని ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ప్రీ ఆర్ డి సెలెక్షన్స్ జరిగాయి. ఈ సెలెక్షన్స్ నిర్వహించడానికి ఎన్ ఎస్ ఎస్ రీజనల్ డైరెక్టర్ ఎమ్. రామకృష్ణ , రీజనల్ డైరెక్టరేట్ నుంచి సంజయ్ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈసారి రిపబ్లిక్ డే పెరేడ్ కు మహిళలకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్ ఎస్ వాలంటీర్లకు తెలిపారు. ఈ ఎంపికకు 40 మంది వాలంటీర్లు హాజరయ్యారు. అనంతరం విశ్వ విద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య దేపూరు భారతి వారిని సన్మానించారు. రిజిస్ట్రార్ ఆచార్య రజని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య విద్యావతి , ప్రోగ్రామ్ అధికారులు డా. నీరజ, డా. మాధవి, డా. పద్మావతి, డా. యువశ్రీ, డా. సునీత, డా. స్వాతి లు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఎంపికలో పాల్గొన్న విద్యార్థినులు

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-వెంకటగిరి: ఏపిఈజిఈఏ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో జిపిఎస్ విధానం అమలు చేయవద్దని స్థానిక తెలుగుగంగ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అదనపు కార్యదర్శి యండి.సలీం మాట్లాడుతూ ఉద్యోగస్తులకు వైసిపి పార్టీ ప్రతిపక్షంలో ఉండగా జగన్‌మోహన్‌రెడ్డి సిపిఎస్ విధానం తొలగించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని ఉద్యోగస్తులకు వాగ్దానం చేసినట్లుగా పాత పెన్షన్ విధానాన్ని అమలులోకి తేవాలన్నారు. సిపిఎస్ ఉద్యోగస్తునికి ముల్లుగా ఉన్నచోట జిపిఎస్ విధానంతో మేకును గుచ్చినట్లైందని ఆవేదన వ్యక్తం చేశారు. జిపిఎస్ విధానం లాభాలుతో కూడుకుందని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు, కానీ ఏ విధంగా మేలు చేకూరుతుందో స్పష్టం తెలపకుండా ఉద్యోగస్తుల బ్రతుకులను పెనంలో నుండి పొయ్యిలోకి తోసేయడమేనన్నారు. ఉద్యోగస్తుడు వద్ద జీతంలో 10 శాతం వసూలు చేసిన మొత్తంను తీసుకుంటూ రిటైర్డ్ అయిన తరువాత పూర్తిమొత్తం ను ప్రభుత్వమే తీసుకొని పెంక్షన్ ఇస్తాననడం ఎంత వరకు న్యామన్నారు. 50 శాతం పెంక్షన్ ఉద్యోగి తీసుకోవాలంటే తను 33 ఏండ్లు సర్వీసు పూర్తిచేసుండాలి అని మెలిక పెట్టడం దారుణమన్నారు. రిటైర్డ్‌మెంట్ తరువాత హెల్త్‌కార్డులకు భరోసా లేదన్నారు. ఉద్యోగి మరణిస్తే కుటుంబానికి పెంన్షన్ వర్తింపుకు క్లారిటీ లేదన్నారు. ఇలాంటి సందేహాలుకు సమాధానం తెలపకుండా బాధిత ఉద్యోగస్తులతో కాకుండా పాత పెంన్షన్ పొంతుతున్న ఉద్యోగస్తులతో సమావేశం ఏర్పాటు చేసి జిపిఎస్ అమలు చేయడం దారుణమన్నారు. ఉద్యోగస్తులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జాలి,దయ చూపి పాత పెంన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిపిఎఫ్ విధానాన్ని అమలు చేస్తా ఉద్యోగ్స్తులు వీధిలలోకి రాక తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆ సంఘ అదనపు కార్యదర్శి విజయలక్ష్మి, ప్రకాష్‌రావు, సురేఖ,బాబురావు,హరీష్ నాయకులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను నేర్చుకోండి

రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని కష్టపడి వివిధ రకాల నైపుణ్యాలను అలవర్చుకొని ఉన్నత రంగాల్లో స్థిరపడాలని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజని పిలుపునిచ్చారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నూతనంగా చేరిన ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థినిలకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ ఆచార్య పి. మల్లికార్జున ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన విద్యార్థినిలు క్యాంపస్ లో ఉన్న లైబ్రరీ సదుపాయాన్ని, కంప్యూటర్ సదుపాయాలను, ఇతర ఆవస్థాపన సౌకర్యాలను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. తరగతులు చక్కగా హాజరై సమర్ధవంతంగా కోర్సులను పూర్తిచేసి ఉన్నతరంగాలు రాణించాలని ఆకాంక్షించారు. ఎస్పిఎంవివి ఉపకులపతి ప్రొఫెసర్ డి.భారతి ఓరియంటేషన్ ప్రోగ్రామ్ థీమ్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తూ నూతన విద్యార్ధులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు కళాశాల నియమ, నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ కళాశాల అభివృద్ధిలో పాత్రులు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ జె.కాత్యాయని, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ త్రిపురసుందరి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఆర్.ఉష, ఎస్పీఎంవీవీలోని వివిధ సెల్‌ల కోఆర్డినేటర్లు, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విద్యావతి, మహిళా భద్రతా విభాగం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సీతా కుమారి ప్రొ. శైలేశ్వరి విద్యార్థులను కళ , సంగీతంలో వినోద కార్యక్రమాలుగా తీర్చిదిద్దారుబీ ప్రొఫెసర్ రమ్య కుబేర్, డిప్యూటీ వార్డెన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ సారా సరోజిని, డాక్టర్ అనన్య, బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ కోఆర్డినేటర్ జి.సుప్రియ, విద్యార్థులు. డా. జె.రెడ్డి పావని, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, ఎంఎస్‌ఎఫ్ నాయకులు

ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ధర్నా

ప్రజాశక్తి -తిరుచానూరు: ఎస్‌సి వర్గీకరణ బిల్లును పార్లమెంట్ లో అమోదించాలంటూ ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, ఎంఎస్‌ఎఫ్ నాయకులు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎన్నో ఏళ్లతరబడి పోరాట పటిమతో కొనసాగిస్తున్న తమ శ్రమను గుర్తించి వర్గీకరణ అమోదం తెలపాలని వారు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా మాదిగలకు తగు న్యాయం జరగలేదని అవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపి న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు పెంచలయ్య, గోపి, ఎంఎస్‌ఎఫ్, ఎంఎస్‌పి నాయకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి -కోట : చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని కోట ఐసీడీఎస్ సూపర్వైజర్ ఐ.కృష్ణమ్మ అన్నారు. శుక్రవారం కోట ఐ.సి.డి.యస్ ప్రొజెక్ట్ పరిధిలో గల కోట నార్త్ గిరిజన కాలనీలో పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ సంపూర్ణ పోషణ కిట్స్ బాలామృతం, చిరుధాన్యాలు వలన కలిగే లాభాలును వివరిస్తూ బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలు, చిన్నవయస్సులో పిల్లలు కలగడం వలన వచ్చే ఇబ్బందులు గురించి గర్భవతులు, బాలింతలకు తెలిపారు. ఈ కార్య క్రమంలో మహిళా పొలిస్ చంద్రకళ, కోట పంచాయతీ పరిధి అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పై ప్రజలలో అవగాహన పెంచాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : పరిసరాల పరిశుభ్రతపై ప్రజలలో అవగాహన పెంపొందించాలని పి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థినిలకు ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ అనిత సూచించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో స్వచ్చతాహి సేవా కార్యక్రమం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ సూచనల ప్రకారం సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 2 వరకు స్వచ్చతాహి సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతిలోని ఎన్.ఎస్.ఎస్ యూనిట్ 16 అధికారిని డాక్టర్.వై.అనిత స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 100 మంది ఇంజనీరింగ్ విద్యార్థి వాలంటీర్ల చేత విశ్వవిద్యాలయంలోని అమ్మవారి గుడి వద్ద శుభ్రం చేయించడమే కాకుండా ప్రతిజ్ఞ కూడా చేయించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని స్థానిక అన్నమాచార్య కళామందిరంలో ఎస్వీ సంగీత కళాశాలలోని కూచిపూడి విభాగం తరపున కళారత్న డాక్టర్ ఉషారాణి కొరియోగ్రఫీలో కూచిపూడి నృత్య ప్రదర్శన విద్యార్థులచే ప్రదర్శించడం జరిగింది. ఈ ఉత్తరప్రదర్శన చూసిన ప్రేక్షకులు మంత్రముగ్ధులై కరతాళ ద్వానాలతో అభినందించారు. తాండవ నృత్యకారి అంతవు నీవే కొలువైతివా మధుర నగరిలో ముద్దుగారే యశోద..కట్టెదుర వైకింతము వన్దేహం జగత్వల్లభమ్ వచ్చెను అలమేలుమంగ రాధా మాధవ - అష్ట పాధి ప్రదర్శించారు. ఇందులో ఎం.భానుజ, హెచ్.ఎన్.హన్విత రెడ్డి, ఎస్.ప్రణతి, పి.రోచన ప్రియ, టి.కీర్తి, తేజేశ్వరరావు, అన్న శ్రీ, స్నేహసాయి విద్యార్థినులు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. ఉమ ముద్దుబాల పర్యవేక్షణలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు.

మాయదారి జిపిఎస్ మాకొద్దు..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఉద్యోగుల జీవితాలను రోడ్డున పడేసేలా ఉన్న జిపిఎస్ విధానం మాకొద్దని శ్రీసరస్వతి మున్సిపల్ హై స్కూల్ ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం వారు ఈ మాయదారి జిపిఎస్ వద్దు మాకు ఓపిఎస్ఎ కావాలి అంట నల్ల రిబ్బన్లతో విధులకు హాజరయ్యారు. భోజన విరామ సమయంలో తమ నిరసనను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు. రాష్ట్ర మొత్తం మీద ఉపాధ్యాయులు, ఉద్యోగస్తులు ఈ మాయదారి జిపిఎస్ వద్దని చెబుతున్నా కూడా ప్రభుత్వం గుడ్డిగా ముందుకు వెళ్లడం సమంజసం కాదన్నారు. ఏపీసిపిఎస్ఈఏ శ్రీకాళహస్తి అధ్యక్షుడు వి గంగయ్య, జిల్లా కార్యదర్శి పి వి సుబ్బారెడ్డి, వెంకటాద్రి, గోపి పావని,

కస్టమర్లకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

- అశోక్ లేలాండ్ సర్వీస్ సెంటర్ ప్రారంభం
- బ్రాంచ్ మేనేజర్ శివప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి- రేణిగుంట: అశోక్ లైలాండ్ కస్టమర్లకు మెరుగైన సేవలందించడమే తమ లక్ష్యమని ఆ సంస్థ బ్రాంచ్ మేనేజర్ శివప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం రేణిగుంట మండలంలోని కెవిఎం హాస్పిటల్ కూడలి సమీపంలో అశోక్ లైలాండ్ 8 బే వర్క్ షాప్ ను జ్యోతి ప్రజ్వలన చేసి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సమావేశంలో ఆటోమోటివ్ బ్రాంచ్ మేనేజర్ శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ అశోక్ లేలాండ్ కస్టమర్లకు 24 గంటలు సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. తిరుపతి మహా పుణ్యక్షేత్రంలో సర్వీస్ సెంటర్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేయడానికి అన్ని రకాలుగా సహకరించిన సిద్దాగుంట సుధాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సర్వీస్ సెంటర్ కస్టమర్లకు మెరుగైన సర్వీసును అందించడం కోసం 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. రేణిగుంటలో గతంలో సాసి వర్క్ షాప్ ఉండేదని కస్టమర్లకు మరింత సేవలు అందించడం కోసం 8 బే వర్క్ షాప్ ను ప్రారంభించా మన్నారు. ఈ వర్క్ షాప్ లో రోజుకు సరాసరి 13 వాహనాలను రిపేరు చేసే సామ ర్థ్యం కలిగి ఉంద న్నారు. పోటీ ప్రపం చంలో 75 ఏళ్లగా అశోక్ లైలాండ్ కస్టమర్ సపోర్ట్ తో ముందుకు సాగుతుందని తెలిపారు. ఇదే సపోర్ట్ ఇకపై కూడా కస్టమర్లు అశోక్ లేలాండ్ పై ఉంచాలని కోరారు. ఎన్ని వర్క్ షాప్ లు ఏర్పాటు చేసిన వాహనాలు బ్రేక్ డౌన్ కాకూడదని కోరుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అశోక్ లేలాండ్ ఏరియా మేనేజర్ రఘునాథ్, ఏపీ సర్వీస్ హెడ్ వైవి రమేష్, ఏపీ రీజనల్ సర్వీస్ మేనేజర్ దుర్గాప్రసాద్, ఆటోమోటివ్ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ మహేశ్వర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి సర్వీస్ సెంటర్ ను ప్రారంభిస్తున్న దృశ్యం

రోజాకు రాజకీయ భిక్ష పెట్టిందే టిడిపి: రజనీకాంత్

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): నగరి ఎమ్మెల్యే , మంత్రి రోజాకు రాజకీయ భిక్ష పెట్టింది టిడిపి అని, పార్టీ క్యాడర్ కు నిరంతరం క్రమశిక్షణను బోధించిన చంద్రబాబునాయుడుపై, లోకేష్ పై మంత్రి రోజా వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో రజనీకాంత్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకముందు రోజా ఆర్థిక పరిస్థితి ఎలా వుందో మంత్రి అయ్యాక రోజాకు ఇంత ఆస్తి ఎక్కడి నుంచి వచ్చిందో ఆ నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు అన్నారు. క్వారీలు మూయించి, ఇసుక మాఫియాను నడిపిస్తూ కోట్లకు పడగలెత్తిందన్నారు. అలాంటి వ్యక్తి రాష్ట్ర భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమించే చంద్రబాబుపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం మంచిది కాదని, ఇదే పరిస్థితి పునరావృతం అయితే తెలుగు యువత తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉందన్నారు. చంద్రబాబుపై అక్రమ ఆరోపణ కేసులు షెల్ కంపెనీల నుండి ఎవరి ఖాతాల ద్వారా చంద్రబాబుకు నగదు చేరిందో ముఖ్యమంత్రి బయట పెట్టాలన్నారు. నందమూరి బాలకృష్ణ ఎమ్మెల్యేగా కరోనా సమయంలో తన హిందూపురం నియోజకవర్గానికి హాస్పిటల్ నిర్మించి ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఎంతోమందికి ప్రాణదానం చేశారన్నారు. బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా వేలాదిమంది రోగులకు ఉచితంగా చికిత్స అందిస్తూ సేవలు చేస్తుంటేఆయనపై విమర్శలు చేయడం మంత్రి అంబటికి తగదన్నారు. 2024 ఎన్నికల తర్వాత వారి పరిస్థితి అయోమయమేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలుగు యువత నాయకులు ఆనంద్ గౌడ్, ఆర్ పి శ్రీనివాసులు, రాఘవ, చరణ్ చౌదరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్నటిడిపి నాయకులు

బైక్ ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

గాయపడిన వృద్ధుడు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండల కేంద్రంలోని ఏ కొల్లు గ్రామానికి వెళ్లే క్రాస్ రోడ్ జాతీయ రహదారిపై శుక్రవారం బైక్ ఢీకొనడంతో వృద్ధుడు కటారి చిన్నయ్య తీవ్రగాయాల పాలయ్యాడు. తడ మండలంలోని పెద్దమాబట్టు గ్రామానికి చెందిన చిన్నయ్య రెండు రోజుల క్రితం ఏకొల్లు గిరిజన కాలనీలోని తన కుమార్తె ఇంటికి వెళ్లాడు. అతను శుక్రవారం తన స్వగ్రామం వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా సూళ్లూరుపేట వైపు నుంచి వేగం గా వస్తున్న బైకు అదుపుతప్పి వృద్ధుడిని ఢీకొంది. చిన్నయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు పోలయ్య సంఘటన స్థలానికి చేరుకొని బైకును బైకు తోలుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వ్యక్తిని 108 సాయంతో హాస్పిటల్ కు తరలించేందుకు ప్రయత్నించగా వారు రాకపోవడంతో పోలీసులు వెంటనే స్వర్ణ టోల్ వేస్ హైవే మొబైల్ కు ఫోన్ చేసి క్షతగాత్రుని నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ విజయ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హోటళ్లు, బేకరీల తనిఖీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల పబ్జి హోటల్‌ను పురపాలక సంఘ కమిషనర్ కేఎల్ఎం రెడ్డి తనిఖీ చేయగా అందులో రాత్రి నిల్వవుంచిన ఆహార పదార్థాలను గుర్తించి, వాటిని పునర్వినియోగించరాదని హెచ్చరిస్తూ ఇలాంటి పొరపాట్లు మళ్లీ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేవతి బేకరిని తనిఖీ చేసి శుభ్రతను తప్పక పాటించాలని హెచ్చరించారు. పట్టణంలోని మదర్ థెరిస్సా బదిర , బుద్దిమాంద్య పాఠశాలను సందర్శించి పిల్లలకు మనోధైర్యంను తెలిపి పలు బహుమతులను అందజేశారు. అనంతరం అండర్ బ్రిడ్జిలోని గ్రిల్‌లో పూడిక తీసివేత కార్యక్రమం చేపట్టారు. పుత్తూరు పట్టణం అభివృద్ధి పథంలో నడిపించుటలో అందరూ పాలుపంచు కోవాలనికోరారు.

తిరుచానూరులో అన్నదానం

సర్పంచ్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి- తిరుచానూరు: తిరుచానూరు గ్రామ పంచాయతీ లోని ఆర్ కే కళ్యాణ మండపం లోని వినాయ క విగ్ర హంను తిరుచానూరు సర్పంచ్ కె.రామ చంద్రరెడ్డి, యోగిమల్లవరం పరమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ శ్రీధర్ రెడ్డి దర్శించుకుని పూజలు నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేసిన తిరుచా నూరు వార్డు మెంబర్ లోకేష్ రెడ్డి తిరుచానూరు ఎంపిటిసి సుబ్రహ్మణ్యం రెడ్డిలను అభినం దించారు. అనంతరం సర్పంచ్ భాగస్వామ్యంతో అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుచానూరు ఎంపిటిసి కె.నరేష్ రెడ్డి బ్రాహ్మణపట్టు ఎంపిటిసి బి.యోగనందరెడ్డి, తిరుచానూరు వార్డు మెంబర్లు మునేంద్ర రాయల్, చంద్రశేఖర్ ఆజాద్, ఆర్ఆర్‌యూత్, సి.ఎస్.ఆర్ యూత్ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : చెన్నై నుంచి తిరుమలకు నడిచి వెళుతున్న గోవింద భక్తులకు రామకృష్ణాపురం పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ విరిత దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి విరిత దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా ఆనవాయితీగా తిరుమలలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాలు తమిళనాడు నుండి తిరుమలకు నడిచి వెళుతున్న భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- రేణిగుంట : రేణిగుంట పట్టణంలోని జిఎం వీధి సబ్ రిజిస్టర్ కార్యాలయం ప్రక్కన అభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడు ప్రతిమను ఈఓపిఆర్డి రత్నమ్మ దర్శించుకున్నారు. శుక్రవారం వినాయకుని విగ్రహం వద్ద బీడీ బాలాజీ,సుమన్,భూపతి సంయుక్త ఆధ్వర్యంలో మధ్యాహ్నం సుమారు వెయ్యి మందికి అన్నప్రసాద వితరణ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈఓపిఆర్డి రత్నమ్మ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. విచ్చేసిన అతిధులకు అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్,ముఖ్య సలహాదారులు జూలియన్ రాజు స్వామివారి తీర్ధ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దినేష్, పూర్ణ, పవన్, సుమన్, ప్రభు, రంజిత్, ప్రదీప్, సుబ్బు, రాజా ధనుంజయులు, గజ పాల్గొన్నారు.

ఎస్వీసీఈ సియస్‌ఏ బ్రాంచ్ లో ఓరియంటేషన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సియస్‌ఏ బ్రాంచ్ లో శుక్రవారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి ఐఐటి డిపార్టుమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వెంకటరమణ బందార్ల హాజరై కంప్యూటర్ జనరేషన్స్, వివిధ రకాలైన కంప్యూటర్ ఛాలెంజెస్ ను విద్యార్థులకు వివరించారు. రోబోటిక్స్, డేటా ప్రాసెసింగ్, ఇండస్ట్రీ అప్లికేషన్స్, సెన్సార్, ముఖ్యంగా కంప్యూటర్ ఇంజనీర్‌కు ఉండవలసిన లక్షణాలు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ టీం వర్క్, ఇండస్ట్రీ ఎడ్యుకేషన్ గ్యాప్ పై విద్యార్థులకు వివరించారు. ఈ బ్రాంచ్ లో ఉండే డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ బ్రాంచ్ ప్రాముఖ్యతను తెలిపారు. విద్యార్థులు ప్రోగ్రామింగ్, లాజికల్ స్కిల్స్ నేర్చుకొని ఇండస్ట్రీకి తయారుగా ఉండాలని, రానున్న కాలంలో ఐదు బిలియన్ ఉద్యోగాలు ఎదురుచూస్తున్నాయని విద్యార్థులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో సియస్‌ఏ విభాగాధిపతి డాక్టర్ ఆర్ స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.